

కంపచెట్ల తొలగింపు తరువాత మంత్రుల భవన సముదాయం


కంపచెట్ల నడుమ హైకోర్టు భవనం, ఐఏఎస్ అధికారుల భవనాలు

- ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా అడవిలా అమరావతి
- 26 వేల ఎకరాల్లో కంపచెట్లతో చిట్టడవిలా రాజధాని
- ప్రభుత్వ భవనాలను కమ్మేసిన కర్రతుమ్మ కంప చెట్లు
- కంపచెట్ల తొలగింపుతోనే నవనగర పునర్నిర్మాణం
- కంపచెట్ల తొలగింపుతో మారుతున్న రూపురేఖలు
- హుందాగా సిద్ధమవుతున్న రాజధాని రహదారులు


కొత్త సొబగులు అద్దుకున్న ఉద్యోగుల భవన సముదాయం



నాడు అడవిలా.. నేడు అందంగా


కంపచెట్ల మధ్య క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయం


కంపచెట్ల మధ్య ఎన్ఐడీ, విట్ విద్యా సంస్థలు


కంప చెట్లలో కనపడకుండా పోయిన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

అద్భుత నగరంగా విరాజిల్లాల్సిన అమరావతి ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్వాకం పుణ్యమా అని అడవిలా మారిపోయింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి బలైపోయింది. గత టీడీపీ ప్రభుత్వం 2014- 19 మధ్య నిర్మించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు తప్ప మిగిలిన ప్రాంతమంతా అడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో అడుగు స్థలం కూడా ఖాళీ లేకుండా కంప చెట్లు పెరిగిపోయాయి. మొత్తంగా 26వేల ఎకరాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఐదేళ్ల లో అడవిలా మారిన అమరావతి కూటమి ప్రభుత్వంలో కొత్త ఊపిరిలు పోసుకుం టోంది. జవసత్వాలు నింపుకుని ఠీవీగా నిలిచేందుకు తపన పడుతోంది. అమరావతిని మింగేసిన కంపచెట్లపైనే కూటమి ప్రభుత్వం ఎక్కుపెట్టింది. కంప చెట్ల తొలగింపుతో నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి నాంది పలికింది.

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 2019 డిసెంబర్‌లో వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చి రాజధాని అమరావతి ధ్వంస రచనకు స్వీకారం చుట్టింది. రాజధాని పరిధిలో వున్న 29 గ్రామాలు, రైతులు ఇచ్చిన భూములు అన్నీ గత ప్రభుత్వ వికృత క్రీడలో నాశనమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కేంద్రంగా ఉండే కోర్ క్యాపిటల్ కర్రతుమ్మ చెట్లతో చిట్టడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో సెక్రటేరియట్ టవర్స్ నీటిలో మునిగిపోగా, ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, రాష్ట్ర హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, న్యాయమూర్తులు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు నివాసాలు, ఐఏఎస్ అధికారులు, సెక్రటేరియట్ ఉద్యోగుల కోసం నిర్మించిన భారీ భవన సముదాయాలు కంపచెట్ల పాలయ్యాయి. భవనాల సంగతి ఎలా ఉన్నా నిర్వహణను కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు, రైతుల ప్లాట్లు సహా ఖాళీ ప్రదేశమంతా తుమ్మచెట్లతో నిండిపోయింది. ప్రభుత్వ భవన సముదాయాలకు వెళ్లే దారులు కూడా కనిపించనంతగా తుమ్మకర్ర పెరిగిపోయింది. కేంద్ర సంస్థలకు కర్రతుమ్మ బెడద తప్పలేదు. విట్, ఎన్ఐడీ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. గడిచిన ఐదేళ్లుగా వేలాది మంది విద్యార్థులు అక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో విద్యాసంస్థల బస్సులు, వందల సంఖ్యలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా సరే రోడ్లు పడలేదు. కర్రతుమ్మ బెడద తప్పలేదు.

● మారుతున్న రూపురేఖలు

అమరావతి అడవిలా మారిపోయిన విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందే జూన్ 11న జంగిల్ క్లియరెన్సుకు టెండర్లు ఆహ్వానించారు. దాదాపు 200 ఎక్సకవేటర్లతో పనులు ప్రారంభించారు. తొలి అడుగుగా ప్రభుత్వ భవనాలు, ప్రధాన రహదారులను చుట్టుముట్టిన కంపచెట్ల తొలగింపుకు పూనుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు నెల రోజుల్లో రెండుసార్లు పర్యటించి పనుల తీరును పరిశీలించారు. అధికారులను పరుగులు పెట్టించారు. కేంద్ర పెద్దలను ఒప్పించి అమరావతి కోసం నిధులు మంజూరు చేయించే ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లారు. ప్రభుత్వ చిత్తశుద్ధి కారణంగా గడిచిన నెలరోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతుండడంతో అమరావతి రూపురేఖలు చాలా వరకూ మారిపోయాయి. కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. నిన్నటి వరకూ దుమ్ము, దూళితో బూజుపట్టిన ప్రభుత్వ భవనాలు దుమ్ము దులుపుకుని అందంగా ముస్తాబవుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్లు, మంత్రుల భవనాలు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాసాలు, క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలు దర్జాగా సిద్ధమవుతున్నాయి. తొలగించిన కంప చెట్ల మధ్య ఠీవీగా తలెత్తుకు నిలుచున్నాయి. ఆకాశాన్ని తాకే అద్భుత భవనాలు నవనగరానికి కొత్త శోభనిస్తున్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు సహా అనేక రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కంపచెట్లను తొలగించి రోడ్లను విస్తరించి తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అందమైన రోడ్లు నేడు హుందాగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. రోడ్లకు ఇరుపక్కలా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు సిద్ధం చేస్తున్నారు. తద్వారా అమరావతిలో కొత్త వెలుగులు రాబోతున్నాయి.

● 26వేల ఎకరాల జంగిల్ క్లియరెన్సుకు శ్రీకారం

ప్రభుత్వ భవనాల పనులు పురోగమిస్తున్న క్రమంలో క్రమంలో మిగిలిన పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజధాని పరిధిలో 26 ఎకరాల్లో అడవిలా పెరిగిన కంపచెట్ల తొలగింపుపై ప్రభుత్వ దృష్టిపెట్టింది. కంప చెట్ల తొలగింపునకు సంబంధించి 30 కోట్ల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని అధికారుల అంచనా వేశారు. టెండర్ల ప్రక్రియలో భారీ కంపెనీలు పాల్గొంటున్నట్లు అధికారుల ద్వారా అందుతున్న సమాచారం. ఈ ప్రక్రియ కూడా ఈ వారంలో పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. టెండర్లు ఖరారైన నెల రోజుల్లోపు కంపచెట్లను తొలగించి రాజధాని రూపురేఖలు మార్చాలని కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.


కంపచెట్లు తొలగించిన తర్వాత హైకోర్టుకు వెళ్లే రోడ్డు

రాయితీపై.. సరుకులు

- దేశవాళి కందిపప్పు కేజీ రూ. 160
- నాణ్యమైన స్టీమ్ బియ్యం (బీపీటీ రకం) కేజీ రూ. 49
- రా బియ్యం కేజీ రూ. 48



గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కందిపప్పు, బియ్యం ధరలు రిటైల్ మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వినియోగదారులకు కొంతమేరకు ఆర్థిక ఉపశమనం కలిగించేందుకు పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైస్, డాల్‌మిల్లర్లతో ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చర్చలు జరిపిన అనంతరం కొంత రాయితీపై కందిపప్పు, బియ్యంని రైతుబజార్లలో ప్రజలకు అందుబాటులోకి ఉంచేందుకు ముందుకొచ్చారు. రెండు, మూడు రోజుల్లో రాయితీ ధరలను బిగ్‌బైన్ మార్కెట్లలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, మూడు జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ గురువారం గుంటూరు జిల్లాలోని పలు రైతుబజార్లు, బాపట్లలో ఆరు చోట్ల, పల్నాడు జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

కందిపప్పు నేడు రిటైల్ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ. 175 నుంచి రూ. 185 వరకు ఉన్నది. బ్రాండెడ్ కందిపప్పు(గుజరాత్, లాతోర్) అయితే రూ. 200 పైమాటే. మరోవైపు రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో విక్రయించిన సబ్సిడీ కందిపప్పుని గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసింది. దీంతో చాలా మంది కందిపప్పు వాడకాన్ని తగ్గించేశారు. ప్రత్యామ్నాయంగా ఎర్రపప్పు, పెసరపప్పుని వినియోగిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం నెల రోజులు మాత్రమే అయ్యాయి. ఇప్పటికిప్పుడు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ కందిపప్పుని అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి. ఇందుకు కారణం పౌరసరఫరాల సంస్థ గిడ్డంగులని తనఖా పెట్టి గత వైసీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చేసింది. ఇవన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చి అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం కందిపప్పుని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేజీ కందిపప్పు రూ. 130కి సరఫరా చేసేందుకు పల్నాడు జిల్లాలోని డాల్‌మిల్లర్లు ముం దుకు రాగా వారి నుంచి కొనుగోలు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పాలు చేసింది.

ఈ నేపథ్యంలో రైతుబజార్లలో దేశవాళి కందిపప్పుని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు కేజీ కందిపప్పు రూ. 160, నాణ్యమైన స్టీమ్ బియ్యం(బీపీటీ వెరైటీ) కేజీ రూ. 49, రా రైస్ కేజీ రూ. 48కి ప్రత్యేక కౌంటర్లలో విక్రయించనున్నారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, ఆర్టీసీ బస్టాండ్, తెనాలిలో ఉన్న రెండు, మంగళగిరి, పొన్నూరులో ఉన్న రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లని గురువారం ఉదయం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. అలానే గుంటూరు నగరంలోని 15 పప్పుల హోల్‌సేల్ దుకాణాలలో కూడా దేశవాళి కందపప్పు, రైస్‌మిల్ పాయింట్ల వద్ద బీపీటీ బియ్యం పైన పేర్కొన్న ధరలకు అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. చిలకలూరిపేటలో రైతుబజార్, మరో కేంద్రం, వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్లలో రెండు కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కువగా ఎంపీడీవో /తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్యవైశ్య కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేశారు. బాపట్ల, వేమూరు, చీరాల, రేపల్లె లోనూ ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీటిని మంత్రులు /ఎమ్మెల్యేలు గురువారం ఉదయం ప్రారంభిస్తారు.

ఇంటింటికి వైద్యసేవలు అందించాలి

- డయేరియా అదుపులోకి వచ్చేంత వరకు అధికారులు విధుల్లోనే
- డయేరియా బాధితులకు ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ పరామర్శ

పిడుగురాళ్ల, జూలై 10: పిడుగురాళ్ల సమీపంలోని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాలలో డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు మున్సిపల్, వైద్యాధికారులు విధుల్లోనే వుండాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం పిడుగురాళ్ల సమీపంలోని లెనిన్‌నగర్ వైద్యశాలలో డయేరియాతో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ అరుణ్‌బాబు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వైద్యులతో మాట్లాడారు. డయేరియా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యసిబ్బంది అప్రమత్తమై ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించడంతో పాటు మున్సిపల్ అధికారుల సమన్వయంతో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా చూడాలని గురజాల ఆర్‌డీఓ రమణాకాంత్‌రెడ్డిని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు పిడుగురాళ్లలోనే వుండి డయేరియా వ్యాధి అదుపులోకి వచ్చేంత వరకు అధికారుల సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులతో పాటు డయేరియాతో మృతి చెందిన అబుబాకర్‌సిద్ధిక్ కుటుంబసభ్యులను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని పరామర్శించారు. అదేవిధంగా ఆయా వీధులలో మురికికాల్వలు ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వవుండటం, మట్టి పేరుకుపోయి వుండటాన్ని గుర్తించిన ఎమ్మెల్యే యరపతినేని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ఇప్పటిదాకా ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. అవసరమైతే ఎక్కువ మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని యరపతినేని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డయేరియా వ్యాధికి నీటి కలుషితమైనట్లు గుర్తించిన బోర్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు.


డయేరియాతో మృతిచెందిన సిద్దిక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్త పడాలి : ఎమ్మెల్యే యరపతినేని

పల్నాడు ప్రాంతంలో ఎక్కడైనా డయేరియా వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రాణహాని జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. రాజకీయం నాకు కొత్తేమి కాదు....ముప్పై ఏళ్ల అనుభవం వుంది. గత వైసీపీ ప్రభుత్వానికి ఇప్పుడున్న మా ప్రభుత్వానికి తేడా ప్రజలు గుర్తించాలి. మేము కూడా అధికారులతో ఎలా పనిచేయించాలో తెలుసన్నారు. ఏది ఏమైనా ప్రజల ఆరోగ్యం, సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏ అధికారినైనా సహించబోనని సున్నితంగా హెచ్చరించారు. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా వుండవచ్చు అన్న అవగాహన కల్పించడంతో పాటు విస్తృతంగా మైకు ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఇప్పటి నుండే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కావలసిన మందులను ముందుగానే తెప్పించుకోవాలన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో డయేరియాను కట్టడి చేసే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. వైద్యం కోసం వచ్చే బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి నా.....మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించినా..కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లెనిన్‌నగర్‌లో ఇటీవల వీధికుక్కల బెడద ఎక్కువైందని, ఓ చిన్నారి కూడా గాయాలపాలైం దన్నారు. అధికారులు వీధికుక్కలను కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ గిరికుమార్‌ను ఆదేశించారు. సమీక్షలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, డీఎం అండ్‌హెచ్‌ఓ రవి, ఆర్‌డీఓ రమణాకాంత్ రెడ్డి, కమిషనర్ గిరి కుమార్, తహసీల్దార్ శ్యాంసుందరరాజు, ఎంపిడిఓ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్, పలువురు వైద్యాధి కారులు తదితరులు పాల్గొన్నారు.



కలుషితమైన బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

సత్య షోరూమ్ ప్రారంభం

నరసరావుపేట లీగల్, జూలై 10: నరసరావుపేట పల్నాడు బస్టాండ్‌లో సత్యఏజెన్సీస్ వారి 24వ షోరూంను బుధవారం ప్రారం భించారు. భవన యజమాని గోవిందరావు రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. ఆయనతో పాటు సత్య ఏజెన్సీ ఏపీ హెడ్ సెన్సిల్‌తో పాటు ప్రముఖ బ్రాండ్ కంపెనీల ప్రతి నిధులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా సెన్సిల్ మాట్లాడుతూ ఇది 24 బ్రాంచ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ షోరూమ్‌లు విజయవంతంగా నిర్వహి స్తున్నామన్నారు. ప్రారంభో త్సవం సందర్భంగా రూ.30 వేలు కొనుగోలుపై ఒక బంగారు నాణెం, రూ.20 వేలు కొనుగోలుపై రెండు కుర్చీలు ఉచితంగా ఇస్తున్నామన్నారు.


రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న గోవిందరావు

ప్రజలకు అందుబాటులో కావాల్సినంత ఇసుక


ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూలై 10: కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విధానంతో ప్రజలందరికీ స్థానికంగానే కావాల్సినంత ఇసుక అందించే అవకాశం లభించిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో ట్రక్కుకు రూ.20 వేలు, ఆపైన కూడా పెట్టిన పరిస్థితులున్నాయన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో నామమాత్రపు ధరకే ఇసుక అందిస్తున్నామన్నారు. సామాన్య మధ్యతరగతికి అతిపెద్ద ఊరటన్నారు. పల్నాడు జిల్లాలో వైకుంఠపురం, కోనూరు, కొత్తపల్లి, మాదిపాడు, వినుకొండ, కొండమోడు స్టాక్ యార్డుల్లో సరఫరాకు ఇసుక నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే చెల్లించి కోటా మేరకు ఇసుక తీసుకోవచ్చని ప్రజలకు తెలిపారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి అమలు చేసిన దుర్మార్గపు విధానాలు రద్దు చేయడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. ఇకపై దళారీలకు వేల రూపాయలు కప్పం కట్టాల్సిన పని లేదని, ఇసుక దొరుకుతుందో లేదో ఇంటి పనులు ముందుకు సాగుతాయో లేదో అన్న భయాలు ఇక అవసరం లేదన్నారు. దీని ద్వారా భవన నిర్మాణ కార్మికులు ఆ రంగంపై ఆధారపడిన ఇతర విభాగాల వారు ఉపాధి, వ్యాపార అవకాశాల విషయంలో బెంగ పెట్టుకోనక్కర్లేదన్నారు. ఇసుక విషయంలో ఊరటనిచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీలు చోరీ

గుంటూరు, జూలై 10: నగరం నడిబొడ్డున హిందూ కళాశాల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం ఏర్పాటుచేసిన బ్యాటరీలను దొంగలు అపరిచిపోయారు నిత్యం వ్యాధి వాహనాల రాకపోకలు సాగించే ఈ ప్రధాన జంక్షన్ లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కు సంబంధించిన పోల్స్ కు ఏర్పాటు చేసిన బ్యాటరీలను దొంగలు అపహరించడం కలకలం రేపింది. గుంటూరు నగరంలోని అత్యంత ట్రాఫిక్ రద్దీ కలిగిన ప్రదేశం హిందూ కళాశాల కూడలి. అక్కడ పగలే కాకుండా రాత్రివేళ కూడా వాహన రాకపోకలు కొనసాగుతుంటాయి. అయితే అటువంటి సెంటర్ లో దొంగలు బ్యాటరీలు అపహరించుకుపోవడం గమనార్హం. ఈ ప్రాంతంలో సిగ్నల్ లైట్స్ కోసం మూడు రోజుల క్రితమే ట్రాఫిక్ పోలీసులు కొత్తగా మూడు బ్యాటరీలు అమర్చారు. అయితే బుధవారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు వచ్చి చూడగా సిగ్నల్స్ వెలగడం లేదు. దీంతో బాక్సులను తెరిచి చూడగా అందులో ఉండాల్సిన బ్యాటరీలు కనిపించలేదు. పోలీసుల ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఇక్కడ ఉన్న సీసీ కెమెరాలు కూడా పనిచేయకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చంద్రబాబు దార్శనికతకు ప్రతీక పట్టిసీమ


నీటి విడుదల అనంతరం పసుపు, కుంకుమ సారెను వదులుతున్న మంత్రి నిమ్మల

- జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు
- కృష్ణా పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, జూలై 10: సీఎం చంద్రబాబు దార్శనికతకు, ముందుచూపునకు నిదర్శనమే పట్టిసీమ ప్రాజెక్టు అని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద పశ్చిమ హెడ్ రెగ్యులేటర్ నుంచి బుధవారం బటన్ నొక్కి మంత్రి నీటిని వదిలారు. ఒక గేటును 2 అడుగుల మేర ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని తాగు, సాగునీటి అవసరాల కోసం పశ్చిమ డెల్టాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణానది జలాలు ఆల్‌మట్టి నుంచి నాగార్జున సాగర్‌కు వచ్చే సరికి ఆగస్టు 2వ వారమవుతుందన్నారు. ఈ లోపు జూలైలో తాగునీటి అవసరాలు తీర్చడానికి, ఖరీఫ్ సీజన్ తొందరగా ప్రారంభించి ఆరుమడి వేసుకోవడానికి పులిచింతల బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించుకున్నామన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఆ రిజర్వాయర్‌లో 30-40 టీఎంసీల నీటిని రిజర్వు చేసుకుని జూలైలో కృష్ణా డెల్టాకు విడుదల చేస్తుంటారని చెప్పారు. పులిచింతలలో 30 టీఎంసీల మాట అటుంచి కనీసం అర టీఎంసీ నీరు కూడా నిల్వ పెట్టలేదన్నారు. నీటిని వృథాగా సముద్రంలోకి వదిలివేసి కృష్ణా డెల్టా ప్రజలకు జగన్ ద్రోహం చేశారని విమర్శించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని, దాన్ని ఆఖరి ఎకరా వరకు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల నుంచి నిర్వహణ లేకపోయినా పట్టిసీమ వద్ద యుద్ధప్రాతిపదికన తుప్పు పట్టిపోయిన మోటార్లకు మరమ్మతులు నిర్వహించి గోదావరి జలాలను కృష్ణమ్మ చెంతకు తీసుకువచ్చినట్లు చెప్పారు. పట్టిసీమ పురుషోత్తమపట్నం, తాడిపూడిలను చక్కబెట్టుకుంటూ వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ నారాయణరెడ్డి, ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈ ప్రసాద్, బ్యారేజి జేఈ దినేష్, ఏఈ వనిత, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, తాడేపల్లి పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, మండవ గోపాలరావు, మండల జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

వర్సిటీలో అక్రమాలపై సిట్‌తో విచారణ చేయాలి

విద్యార్థి జేఏసీ నాయకుల ధర్నా.. డిమాండ్

పెదకాకాని, జూలై 10: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్ కమిటీ ద్వారా విచారణ చేయాలని విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ మెయిన్ గేటు దగ్గర నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు రాయపాటి జగదీష్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 జూన్ వరకు వర్సిటీలో రూ.30 లక్షలు వరకు నిబంధనలకు విరుద్ధంగా వీసీ మంజూరు చేశారన్నారు. వర్సిటీలో విద్యార్థుల కోసం అభివృద్ధి చేయాల్సిన నిధులను పందికొక్కుల్లా పంచుకున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతో వర్సిటీ నిధులన్నీ కూడా పక్కదోవ పట్టాయన్నారు. ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో మట్టికి కూడా బిల్లులు పెట్టి లక్షల్లో శాంక్షన్ చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 14 యూనివర్సిటీలపై విచారణకు సిట్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రసాద్‌రెడ్డి దగ్గర నుంచి నాగార్జున యూనివర్సిటీ రాజశేఖర్ వరకు అందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. సేవ్ నాగార్జున యూనివర్సిటీ పేరుతో ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ ఔట్‌సోర్సింగ్ నియామకాలపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో విగ్రహాల ఏర్పాటులో కూడా అవినీతి జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు నంబూరు శాస్త్రి, నంబూరు రాజేష్, రాము, శ్యామ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్లటౌన్, జూలై 10: టీ తాగేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని చెన్నకేశవకాలనీ సమీపంలో బుధవారం జరిగింది. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బొంతగాని శ్రీనివాసరావు గౌడ్(45) గ్రామంలో టెంట్‌హౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయాన్నే టెంట్ హౌస్ తెరిచి టీ తాగేందుకు మాచర్లకి కాలినడకన బయలుదేరాడు. మార్గమధ్యలో చెన్నకేశవకాలనీ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. శ్రీనివాసరావు గౌడ్ కిందపడిపోగా అతడిపై నుంచి వాహనం వెళ్లడంతో తల ఛిద్రమైంది. పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అమరావతిలో 10 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్రవాహనం

అమరావతి, జూలై 10: అమరావతి మండలం దిడుగు గ్రామంలో బుధవారం పది కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని నక్షత్రం మర్రి చెట్టువద్ద స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై గంజాయి ప్యాకెట్లను తీసుకెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తించారు. వారిని విచారించగా దిడుగు గ్రామానికి చెందిన దున్నా ప్రభుదాసుకు ఇచ్చేందుకు గంజాయిని తీసుకువస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలానికి చెందిన ఆడెంగుల రవికుమార్, గెర్ల బాబు తెలిపారు. దిడుగు గ్రామానికి చెందిన ప్రభుదాసు పాడేరుకు చెందిన ఇద్దరితో గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సీఐ మంగారావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

దుర్గి, జూలై 10: అప్పుల భారంతో ఆత్మహత్యకు యత్నించిన దుర్గి మండలం శ్యామరాజపురానికి చెందిన కౌలు రైతు యంగ్ర పోతురాజు(50) బుధవారం మృతి చెందాడు. పదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి రాకపోవడంతో రూ.10 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పు తీర్చే మార్గం కనిపించక మనస్తాపంతో సాగు చేస్తున్న పొలంలోనే ఈ నెల 3న పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకట్రావమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

దాడి కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 10: దాడి కేసులో నేరం రుజువవ్వడంతో నిందితుడు చిలకలూరిపేటకు చెందిన దారా బాబుకు దిగువ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానాను ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. నిందితుడు 2018 జూలై 15న స్వల్ప వివాదం నేపథ్యంలో తను ఉండే ప్రాంతానికి చెందిన గోనుగుంట్ల వెంకయ్యపై దాడి చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో శిక్ష విధిస్తూ చిలకలూరిపేట కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడు జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోగా ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయ స్థానం దిగువ కోర్టు తీర్పును ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ మల్లారెడ్డి నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నాదెండ్ల, జూలై 10: గుంటూరు - కర్నూలు రహదారిపై సాతులూరు గ్రామ పరిధిలో జరిగిన ప్రమాదంలో కోరుమళ్ళ వెంకట రమణ(26) అనే యువకుడు మృతి చెందాడు. ప్రకాశం జిల్లా పెద అరవీడు మండలం రామాయపాలేనికి చెందిన వెంకటరమణకు భట్టిప్రోలుకు చెందిన చింతగింజల దివ్యశ్రీతో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు భట్టిప్రోలు వచ్చిన భార్యభర్తలు బైక్‌పై రామాయపాలేనికి మంగళవారం రాత్రి బయలు దేరారు. సుమారు 11 గంటల సమయంలో నరసరావుపేట నుంచి ఎదురు వస్తున్న ఆటో వారి బైక్‌ను సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో వీరిని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భార్య దివ్యశ్రీని 108లో నరసరావుపేట తరలించారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డం గ్యాంగ్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాదర్బార్‌కు రాష్ట్ర వ్యాప్తంగా అర్జీదారుల రాక.. ● ఓపిగ్గా సమస్యలు వింటూ భరోసా ఇస్తున్న మంత్రి లోకేశ్


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జులై 10: రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా స్పందన లభిస్తోంది. అన్ని ప్రాంతాల నుండి పలువురు అర్జీదారులు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఉండవల్లిలోని లోకేశ్ ఇంటి వద్దకు రావడంతో కరకట్టపై భారీగా బారులు తీరిన ప్రజలు కనబడుతున్నారు. ఉదయం 5 గంటలకే అర్జీదారులు వస్తుండడంతో కరకట్ట ప్రాంతం కళకళలాడుతోంది. దివ్యాంగులు సైతం లోకేశ్ భరోసా కోసం ఆశగా అర్జీలు తీసుకుని తమ కుటుంబసభ్యులతో లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. లోకేశ్ ఓపిగ్గా అర్జీదారుల సమస్యలు విని పరిష్కారానికి భరోసా ఇస్తూ వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు. పలువురు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని, అనారోగ్యంతో బాధపడుతున్నామని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్యాక్రాంతమైన భూముల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జల్లా గుడివాడలో గడ్డం గ్యాంగ్ ఆగడాలకు తీవ్రంగా నష్టపోయాయనని సదరు గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవాలని మునునూరు హరికృష్ణ మంత్రి లోకేశ్‌ను కలిసి పిర్యాదు చేశాడు. ఏపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ సంస్థలో ఎంఎస్‌వోగా, ఆపరేటర్‌గా పని చేస్తున్నానని, 2017లో ఏపి టిడ్కో గృహాలకు ఫైబర్ నెట్ ప్రసారాలు అందించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని 50లక్షల వ్యయంతో వైరింగ్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రసారాలు అందించానని వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో గడ్డం గ్యాంగ్ రంగంలోకి దిగి ఫైబర్‌నెట్ సిగ్నల్ వ్యవస్థకు విద్యుత్ ప్రసారం కాకుండా అడ్డుకుని తనను తీవ్రంగా వేధించి వైర్లను ధ్వంసం చేసి నష్టపరిచారని వారిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని హరికృష్ణ కోరారు. చర్యలు తీసుకుంటామన్న లోకేశ్ హరికృష్ణకు భరోసా ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా మంగళగిరి ఏపీఎస్‌పి బెటాలియన్ వద్ద నివసిస్తున్న తమకు దారి సమస్య ఉందని పరిష్కరించాలని ఏపీఎస్‌పి విశ్రాంత ఉద్యోగులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్టేట్ పోలీస్ అసోసియేషన్ ఎన్నికల కాలపరిమితి ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించాలని మంగళగిరి 6వ బెటాలియన్ సిబ్బంది కోరారు. సీపీఎస్ విధానం అమలు తేదీ కంటే ముందే నియామక పత్రాలు పొందిన తమకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని 2003 బ్యాచ్ పోలీసు కానిస్టేబుళ్లు విజ్ఞప్తి చేశారు. పవులూరు దివ్యాంగులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పలువురు తమ సొంత సమస్యలతో లోకేష్‌ను కలువగా వారి సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

సూర్యలంక తీరానికి పర్యాటకులకు అనుమతి

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన.. చిరువ్యాపారుల హర్షం


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బాపట్ల, జూలై 10 : ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకుల రాకపోకలను గత నెల 24వ తేది నుంచి తాత్కాలికంగా నిషేధించారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో పర్యాటకుల రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేయటంతో చిరువ్యాపారుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయమై బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన సూర్యలంక తీరంలో దుకాణాల మూత, కొనసాగుతున్న పర్యాటకుల నిషేధం, నిర్మానుష్యంగా సముద్రతీరం, చిరువ్యాపారులపై తీవ్రప్రభావం అంటూ వెలువడిన కథనంపై జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ సీహెచ్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీహరి పర్యవేక్షణలో పర్యాటకులకు అనుమతినిచ్చారు. దీంతో సూర్యలంక తీరానికి బుధవారం నెమ్మదిగా పర్యాటకుల రాకపోకలు సాగాయి. పోలీసులు అనుమతిచ్చారని తెలుసుకున్న పర్యాటకులు, చిరువ్యాపారులు సంతోషంతో సూర్యలంక తీరానికి వచ్చి స్నానాలు చేస్తూ సందడి చేశారు. పర్యాటకులు మద్యం సేవించి సముద్రంలోకి వెళ్ళరాదని లోతుకు వెళ్ళి ప్రమాదాలు తెచ్చుకోవద్దుఅని రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు.

పున్నమ్మ చెరువు.. కబ్జా

అనుమతులు లేకుండా కల్యాణ మండప నిర్మాణం ● సీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేసినా ఆగని పనులు ● వైసీపీ హయాంలో రాజ్యసభ సభ్యుడితో అధికారులపై ఒత్తిళ్లు ● అక్రమ నిర్మాణాల వద్ద తాజాగా టీడీపీ ఎమ్మెల్యే, మంత్రుల ఫ్లెక్సీలు


పున్నమ్మచెరువులో నిర్మిస్తున్న కళ్యాణ మండపం

తాడికొండ, జూలై 10: వందేళ్ల క్రితం ప్రజలు, బాటసారుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన పున్నమ్మ చెరువు కబ్జాకు గురైంది. 23 సెంట్ల స్థలంలోని చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుని కనుమరుగైంది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. చెరువును పూడ్చివేసి ప్రహరి నిర్మించినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడలేదు. సీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదులు అందడంతో తప్పని పరిస్థితుల్లో నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. రాజధానికి సింహద్వారంగా ఉన్న తాడికొండ అడ్డరోడ్డులో భూములు ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. సర్వే నెంబరు 12లో 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అండగల్, 1బీ, పాస్‌పుస్తకాలు లేకుండానే, లాండ్ కన్వర్షన్ చేయకుండానే పొలంలో అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అక్రమ నిర్మాణాలు చేయటంతో పాటు, చెరువును ఆక్రమించిన వ్యక్తిపై పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సరే ఇంత వరకు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు.

● వైసీపీ ప్రభుత్వం హయంలో రాజ్యసభ సభ్యుడి సహకారంతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్మాణాలను అడ్డుతగలకుండా చేయించారని గతంలో పని చేసిన అధికారులు చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నాయకులతో అంటకాగిన అక్రమ నిర్మాణదారుడు.. కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని చెరువు వద్ద ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉన్న ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై టీడీపీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కబ్జాపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా రికార్డులో అక్కడ చెరువు లేదని చెప్పారు. పున్నమ్మ చెరువు ఆక్రమణపై సీపీఐ పోరాటాలు చేస్తునే ఉన్నది. చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేయడంపై సీఆర్‌డీఏ అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసినా నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు జీరో స్థాయికి చేరాలి

- సాంకేతిక లోపాల్లేకుండా చర్యలు తీసుకోవాలి
- వినియోగదారుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి
- గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ మురళీకృష్ణయాదవ్

గుంటూరు, జూలై 10: విద్యుత్ సరఫరాలో ఇకపై అంతరాయాలు జీరో స్థాయికి చేరాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణ యాదవ్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గుంటూరు టౌన్-1 ఈఈ టి శ్రీనివాసబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అన్ని స్థాయిల్లో ఉండాలన్నారు. వోల్టేజ్‌లో హెచ్చు, తగ్గులు, అంతరాయాలు, లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. దీనిపై సెక్షన్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు


మోతడక వెంచర్లకు కంకర తోలుతున్న గ్రావెల్ లారీలు

తుళ్లూరు, జూలై 10: అనంతవరం నుంచి యథేచ్ఛగా గ్రావెల్ తరలుతుంది. గత వారం నుంచి మోతడక వెంచర్లకు అనంతవరం కొండ ప్రాంతం నుంచి కర్లపూడి మీదగా గ్రావెల్ వెళుతుంది. ఎక్స్‌కవేటర్‌తో తవ్వి లారీలకు లోడు చేస్తున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై మైనింగ్ డీడీ చంద్రశేఖర్‌ని వివరణ కోరగా, మైనింగ్ విజిలెన్స్ ఏడీ శివాజీని సంప్రదించాలన్నారు. ఆయనను వివరణ అడిగితే డీడీతో చెప్పాలన్నారు. ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం గమనార్హం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129, 140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జంగా కృష్ణమూర్తి, మక్కెన మల్లికార్జునరావు

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- ఎన్వీ పాలెంలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్సీ జంగా

అమరావతి, జూలై 10: ప్రపంచ స్థాయిలో తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నందమూరి తారక రామారావు నిలిచారని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్వీ పాలెంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించే లక్ష్యంతో ఎన్టీఆర్ సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఎన్టీ రామారావు పాలన అందించారని, ప్రజలకు రాజకీయ చైతన్యం తీసుకు వచ్చిన ఘనత ఆయనదేనన్నారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, టీడీపీ నేతలు మక్కెన మల్లికార్జునరావు, వెన్నా సాంబ శివారెడ్డి యన్‌టీఆర్ చేసిన సేవలు గురించి కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

పాఠశాల భూమిపై ఆర్డీవో ఆరా..

- పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

రెంటచింతల,జూలై 10 : అదనపు తరగతి గదులకు నోచుకోని రెంటాల జడ్పీ పాఠశాల అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు గురజాల ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి స్పందించారు. బుధవారం రెవెన్యూ, ఎంఈవో, ఎంపీడీవోలతో మాట్లాడుతూ ఆ పాఠశాలకు కేటాయించిన స్థలం స్వభావం, ఆ భూమిపై కోర్టుకు ఎవరెవరు వెళ్లారు. ఎంత కాలంనుంచి ఇతరుల సాగులో ఉంది అనే విషయాలపై పూర్తి సమాచారాన్ని అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 2016లో అప్పటి తహసీల్దార్ లెవీ 403 సర్వే నెంబర్‌లో వున్న 4 ఎకరాల 60 సెంట్లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ భూమిపై ముగ్గురు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో స్థల సేకరణ నిలిచిపోయింది. భవన నిర్మాణాలకు కేటాయించిన రూ.1.35 కోట్లు అలాగే ఉండిపోయాయి. గతంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పాఠశాలను సందర్శించడంతో పాటు భూమిని పరిశీలించి దానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నివేదించిన విషయం పాఠకులకు విదితమే.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

తాగు నీటి కాలుష్య నివారణకు చర్యలు

- దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు

దాచేపల్లి, జూలై 10: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఆరోగ్య సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి ట్యాంకర్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, విద్యుత్ మోటార్లు వున్న బోర్ల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని, డ్రెయినేజీలలోని తాగు నీటి పైపులు లీకేజీలు లేకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. అంతేకాకుండా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, వీధులలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రధానంగా బడుగు బలహీనవర్గాలు అధికంగా నివశించే ప్రాంతాలలో ఆరోగ్య రక్షపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు, అతిసార వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ బంగ్లాల మరమ్మతులకు నిధులు..

పిడుగురాళ్ల, జూలై 10: గురజాల నియోజకవర్గ పరిధిలోని మూడు ఆర్అండ్‌బీ బంగ్లాల మరమ్మతుల నిర్వహణకు ప్రభుత్వం రూ.1 కోటి 37 లక్షలకుపైగా నిధులు మంజూరు చేసిందని పిడుగురాళ్ల ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ యూసుబ్ తెలిపారు. పిడుగురాళ్ల ఆర్అండ్‌బీ బంగ్లాకు రూ.46.80 లక్షలు, దాచేపల్లిలోని బంగ్లాకు రూ.48 లక్షలు, గురజాల బంగ్లాకు రూ.48 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే పలు రహదారుల మరమ్మతులకు రూ.13 కోట్ల 40 లక్షలు మంజూరైనట్లు ఏఈ తెలిపారు.



విత్తన బంతులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరావు

అడవుల విస్తరణకు అటవీశాఖ కృషి : డీఎఫ్‌వో

కారంపూడి, జూలై 10: అడవుల విస్తరణకు అటవీశాఖ కృషి చేస్తోందని డీఎఫ్‌వో రామచంద్రరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం అటవీశాఖాధికారులు అడవి రక్షణ, వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో రామచంద్రరావు పాల్గొని మాట్లాడారు. పెద్ద ఎత్తున విత్తన బంతులు తయారు చేసి ఈ వర్షాకాలంలో అనువైన ప్రాంతాల్లో విసరడం ద్వారా అటవీ విస్తరణ పెంచడంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ రేంజి ఆఫీసర్ వెంకటరమణ, కారంపూడి బీట్ ఆఫీసర్ బాషా, కోటి విత్తనాలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కొమెర జాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తుడిపై అర్చకుడు దాడి

అమరావతి, జూలై10: భక్తుడిపై అర్చకుడు దాడిచేసిన ఘటన బుధవారం స్థానిక బాలచాముండికాసమేత అమరేశ్వరాలయంలో జరిగింది. ప్రకాశంజిల్లా డోర్నాల సమీపంలో యడవల్లి గ్రామానికి చెందిన గురువా బాబు స్వామివారి దర్శనంకోసం ఆలయానికి వచ్చాడు. గర్భగుడిలో అర్చకుడు లేకపోవడంతో తెలియక స్వామివారి మూలవిరాట్‌ను తాకి దండంపెట్టుకున్నాడు. అప్పుడే వచ్చిన అర్చకుడు మల్లిక్ భక్తుడుపై ఆగ్రహం వ్యక్తం చేసి అతడిపై కర్రతో దాడి చేశాడు. విషయమై ఈవో దృష్టికి వెళ్లగా మల్లిక్ వివరణ కోరారు. తనను తిట్టడంతోనే కొట్టానని అర్చకుడు సమాధానం ఇచ్చాడు. అలాగే ఫిర్యాదు ఇస్తే చర్య తీసుకుంటానని ఈవో భక్తుడు గురవాబాబుని కోరగా, ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా చూస్తే చాలు.. అని చెప్పి ఫిర్యాదు ఇవ్వకుండానే భక్తులు అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమిస్తాం

మాచవరం, జూలై 10: రానున్న రోజుల్లో ఉన్నతాధికారుల సూచనలు, సలహాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి గర్భదారణ సమయంలో వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని వైద్యాధికారి ప్రసాద్ సూచించారు. బుధవారం మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఎ కార్యక్రమం నిర్వహించి గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

హెల్మెట్ ధరించండి.. రక్షణ పొందండి



అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్

- న్యాయాధికారులు శ్రీనివాస్ కల్యాణ్, శ్రీనివాసరావు
- ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన, ర్యాలీ
- పాల్గొన్న న్యాయవాదులు, విద్యార్థులు

మాచర్లటౌన్, జూలై 10: ద్విచక్ర వాహన చోదకులు వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి రక్షణ పొందాలని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీరాం శ్రీనివాస్ కల్యాణ్ కోరారు. బుధవారం పట్టణంలో మోటారు వెహికల్, పోలీసు అధికారులు, న్యాయవాదులతో కలిసి హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. వాహనదారులు నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. అతివేగంతో వాహనాలను నడపవద్దన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ శేషిరెడ్డి, పట్టణ ఎస్ఐ బత్తుల గోపాల్, ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు, మెట్టు గోవిందరెడ్డి, న్యాయవాదులు నాగిరెడ్డి, శీలం వెంకటేశ్వర్లు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, కృష్ణమూర్తి, పేర్ల వెంకటేశ్వర్లు, రాంబాబు, గంగుల శ్రీనివాసరావు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గురజాలటౌన్ : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని నవోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మోటారు వాహనాల సంబంధిత చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాసరావు హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మందపాటి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది జానీబాషా, గురజాల ఎస్ఐ సౌదరరాజన్, కళాశాల కరస్పాండెంట్ అంకిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

భూ ఆక్రమణలపై సిట్‌తో దర్యాప్తు ..



విలేకర్లతో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

- ఉచిత ఇసుక పాలసీతో కార్మికులకు జీవనోపాధి
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగే ఏకైక వ్యక్తి చంద్రబాబే
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 10: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లపాలనలో గురజాల నియోజకవర్గంలో జరిగిన భూ ఆక్రమణలపై సిట్‌తో దర్యాప్తు చేయిస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో భూ ఆక్రమణలు ఎన్నో జరిగాయని, రెవెన్యూ రికార్డులను మార్చేసి రుణాలు పొందిన వైనంపై సిట్‌తో దర్యాప్తు జరిపిస్తామని యరపతినేని అన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలో ఎవరు అవినీతికి పాల్పడ్డారో గుర్తిస్తామన్నారు. టిడ్కో గృహాలు 80 శాతం టీడీపీ హయాంలోనే పూర్తిచేసినా ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏమీ పట్టించుకోలేదన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని, ఉచిత ఇసుక పాలసీతో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు లభించడం ఆయా కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో యరపతినేని నిఖిల్, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పులుకూరి కాంతారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, వున్నం వెంకట్రావు, ఎల్వీఆర్, జొన్నలగడ్డ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, కటకం అంకారావు, సైదా, శ్రీను, రమేష్, చిన్న, ఖాశింసైదా తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అరుణ్‌బాబును కోరిన ఎమ్మెల్యే యరపతినేని

గురజాల నియోజకవర్గ పరిధిలోని దైద, గుత్తికొండబిళం, కాట్రపాడు, మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయాల ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా గుర్తించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబుకు సూచించారు. బుధవారం పిడుగురాళ్లకు వచ్చిన కలెక్టర్ అరుణ్‌బాబు ఆర్అండ్‌బీ బంగ్లాలో యరపతినేనితో కలసి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక కేంద్రాల స్థితిగతులను కలెక్టర్‌కు వివరించి, ఆయా ప్రాంతాలను సందర్శించాలని యరపతినేని కోరారు.

పౌష్టికాహారంతో రక్త హీనత నివారణ

- విద్యార్థినుల రక్తనమూనాల సేకరణ

వెల్దుర్తి, జూలై 10: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీతన సమస్యలను అధిగమించవచ్చని ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాలలో బుధవారం వైద్య సిబ్బంది విద్యార్థినుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఫలితాలు వచ్చిన తర్వాత రక్తహీనత ఉన్న విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. రక్తహీనతతో బాధపడే విద్యార్థినులకు ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం అందిస్తామని అన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనధికార షెడ్డు నిర్మాణం తొలగింపు

- ఎమ్మెల్యే ఆదేశాలతో మునిసిపల్ అధికారుల చర్యలు

సత్తెనపల్లి, జూలై 10 : పట్టణంలోని 31వ వార్డులో ప్రాథమిక పాఠశాల ఎదురు కాలువపై వైసీపీ కౌన్సిలర్ అనుచరుడి ప్రోద్బలంతో ఒక మహిళ నిర్మించిన అనధికార షెడ్డును పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం తొలగించారు. ఈ అనధికార షెడ్డు నిర్మాణ విషయం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి రాగా, తక్షణమే ఆ షెడ్డుని తొలగించాలని ఆయన మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించడంతో అధికారులు ఆయా షెడ్డును తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని, పట్టణంలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు.

గుర్తింపు కోసమే అంబటి ప్రెస్‌మీట్‌లు

సత్తెనపల్లి, జూలై 10: మాజీ మంత్రి అంబటి రాంబాబు తాను ఉన్నాన్న విషయాన్ని గుర్తించాలన్న తాపత్రయం కోసమే ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడుతూ ఉంటాడని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలు అంబటికి బుద్ధి చెప్పినా ఆయన పద్ధతులు ఏమాత్రం మారలేదన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఏ ఒక్క పనిని చేయని కారణంగానే ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ఆయనను తరిమి కొట్టారన్నారు. అలాంటిది ప్రజా కూటమి ప్రభుత్వంపై అంబటి రాంబాబు తప్పుడు ప్రచారం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఇప్పటికైనా అంబటి తన తీరు మార్చుకోవాలని దివ్వెల సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందించాలని వినతి

పిడుగురాళ్ల, జూలై 10: పట్టణానికి చెందిన నడికోట మోహన్ రమేష్ అనే దివ్యాంగుడు బుధవారం పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసి సీఎం సహాయనిధి కింద ఆర్థిక సాయం అందజేయాలని వినతిపత్రం అందించాడు. తప్పకుండా తగుసాయం అందించేలా చూస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



రోటరీక్లబ్ నూతన కమిటి సభ్యులు

రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మాచర్ల రూరల్, జూలై 10: పట్టణంలోని కేసీపీ ఆడిటోరియంలో బుధవారం రోటరీ క్లబ్ నియోజకవర్గ నూతన కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా కొండవీటి కృష్ణకుమారి, కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ, కార్యదర్శి పఠాన్ నాగూర్‌వలి, డైరెక్టర్ జనరల్ శరత్ చౌదరి, తాళ్ల రాజశేఖరరెడ్డి, డిప్యూటీ గవర్నర్ డాక్టర్ రామకోటయ్య, సుమిత్రకుమార్, కేసీపీ జీఎం వెంకటరమణ, డాక్టర్ బీవీ రంగారావు, తిర్లిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

మాచర్ల రూరల్, జూలై 10: మండలంలోని ఏడో మైలు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం సర్పంచ్ పసుపులేటి బ్రహ్మనాయుడు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే గ్రామంలో సైడు కాలువలు పరిశీలించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ వెంకట్రామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామాంజినాయక్, పగడాల సీతయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌గా ఆంజనేయులు నాయక్

రెంటచింతల, జూలై 10: రెంటచింతల ఎస్‌బీఐ మేనేజర్‌గా ఆంజనేయులునాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన దాచేపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పున్నారావు మాచర్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు పెద్ద మొత్తంలో రుణాలు అందచేస్తామని తెలిపారు.

విద్యుత్ ప్రాజెక్టు ఏడీఈగా రత్తయ్య


రెంటచింతల, జూలై 10: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఏడీఈగా రత్తయ్య బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్ఈ వేంకటరమణ సమక్షంలో ఈయన విధుల్లో చేరారు. రత్తయ్యకు గతంలో టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు పనిచేసిన అనుభవం ఉంది.

షెడ్ నెట్ నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

- ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్

క్రోసూరు, జూలై 10: షెడ్ నెట్ నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొంది ఉండాలని ఉద్యాన అధికారి డాక్టర్ నవీన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి వీ.వేణుగోపాల్ తెలిపారు. వారంరోజుల్లోగా నర్సరీల నిర్వాహకులందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని, ఇందుకోసం తక్షణమే వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని అనంతవరం, క్రోసూరు గ్రామాల్లో వారు పర్యటించి లైసెన్స్‌లు లేని షెడ్ నెట్ నర్సరీల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. లైసెన్స్‌లు లేకుండా, రికార్డులు నిర్వహించకుండా నర్సరీలు నడిపితే చట్ట రీత్యా నేరమన్నారు. నర్సరీల వారు రైతులకు ఇచ్చే విత్తనాలకు తగిన బిల్లులు ఇవ్వాలని, అన్ని రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు నాణ్యమైన మొక్కలను నర్సరీలలో ఉంచాలన్నారు. ఈసందర్భంగా నర్సరీల యజమానులకు తగు సూచనలు చేశారు.

సత్తెనపల్లి రూరల్ : నర్సరీ యజమానులు తప్పనిసరిగా నర్సరీ లైసెన్స్ తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్ అన్నారు.



షెడ్ నెట్ నర్సరీల నిర్వాహకులకు నోటీసులు అందజేస్తున్న అధికారులు

మండలంలోని కంకణాలపల్లి, ధూళిపాళ్ళ గ్రామాల్లోని నర్సరీలను, షేడ్ నెట్‌లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారంరోజుల్లో షెడ్‌నెట్, నర్సరీల నిర్వాహకులు లైసెన్స్ పొందాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నర్సరీ యజమానులు రైతు తెచ్చే విత్తనాలకు బిల్లు నకలు తీసుకొని దాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.



ఇసుక రీచ్‌లో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

నిబంధనల మేరకే ఇసుక సరఫరా

- పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్

అమరావతి, జులై 10: ఇసుక విధానంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా నిబంధనల ప్రకారం ఇసుక పంపిణీ జరుగుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్‌ను ప్రవీణ్ సందర్శించారు. ఇసుక బుకింగ్, లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చారన్నారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఇసుక పాలసీ వలన ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకు వచ్చిందని అన్నారు. పేదల గృహ నిర్మాణానికి, కార్మికుల ఉపాధికి మార్గం సుగమం కావడంతో ఆయా వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆ పార్టీ నేతలు ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకొని కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు వైకుంఠపురం రీచ్ నుండి 2800 టన్నుల ఇసుక లోడింగ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, మైనింగ్ ఏడీ నాగిని, తహసీల్దార్ వెంకటరమణారావు, ఎంపీపీ హనుమంతరావు, సర్పంచ్ ఎం విఠల్‌రావు, పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

నకరికల్లు, జూలై 10 : రైతులకు పశుగ్రాస విత్తనాలను 75శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు నరసరావుపేట, నకరికల్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పీ.రామారావు, డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. బుధవారం నకరికల్లులోని ప్రాంతీయ పశు వైద్యశాలలో సబ్సిడీపై పశుగ్రాగ విత్తనాలను రైతులకు అందజేశారు. అనంతరం రామారావు, వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ పశుగ్రామ విత్తనాల కిలో పూర్తి ధర రూ 92 అని, ఐదు కిలోల సంచి రూ.460 సబ్సిడీ పోగా రైతు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 20 కిలోలకు అందజేయనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

క్రోసూరు, జూలై 10: సమాజంలో జరుగుతున్న సైబర్‌నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గుడ్ షఫర్డ్ సంస్థ డైరెక్టర్, సుపీరియర్ సిస్టర్ విన్నరసీ అన్నారు. బుధవారం మండలంలోని బయ్యవరం హైస్కూల్లో సంస్థ కో-ఆర్డినేటర్ లక్ష్మణ్ అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఫోన్‌లకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబరు 1930కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ నూతక్కి దిలీప్ ఉపాధ్యాయులు మారుతీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

- ఇంటి స్థలం విషయంలో వివాదం
- మాజీ సర్పంచ్ పాత్రావత్ అంజి నాయక్ తీవ్ర గాయాలు



గాయపడిన టీడీపీ నేత అంజీనాయక్

వెల్దుర్తి, జూలై 10: వెల్దుర్తి మండలం రాంపురం తండాలో ఇంటి స్థల విషయంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు ఘర్షణ ఏర్పడటంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ పాత్రావత్ అంజినాయక్ తీవ్రగాయాలపాలైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది గ్రామంలో ఇంటి స్థల విషయంలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ అంజి నాయక్ వైసీపీకి చెందిన కేతావత్ గోవిందా నాయక్ అంజి నాయక్ మధ్య మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. 'గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మా స్థలనాక్రమించి, కట్టుబడి చేశారని, ఈ విషయమై వైసీపీ నేత గోవిందనాయక్‌ను ప్రశ్నించగా తనపైనే దాడికి దిగాడని టీడీపీ నేత అంజినాయక్ ఆరోపించారు. వైసీపీకి చెందిన కేతావత్ గోవిందునాయక్, కేతావత్ అంజినాయక్‌లు తనపై రాడ్లు కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచినట్లు అంజి నాయక్ వాపోయాడు. తలపై తీవ్ర గాయమైన అంజినాయక్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం నరసరావుపేటకు రిఫర్ చేశారు. అలాగే వైసీపీకి చెందిన గోవింద గోవిందనాయక్, అంజినాయక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

ఆలయంలో వ్యాపారాల నిర్వహణకు వేలం

అచ్చంపేట, జూలై 10 : మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో వేంచేసివున్న సత్తెమ్మతల్లి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో వివిధ వ్యాపారాల నిర్వహణకు లీజు హక్కులు పొందేందుకు గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఆలయ కార్యనిర్వాహణ అధికారి గాదె రామ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు క్యాంటీన్, కూల్‌డ్రింక్స్ అమ్ముకొనే హక్కులకు రూ.50వేలు దరావత్తు చెల్లించాలన్నారు. కొబ్బరి చిప్పలు, చీరలు, జాకెట్ ముక్కలు సేకరించుకొనే హక్కు, టెంట్ సామను, వంట సామాగ్రి, సిలీండర్లు, పొయ్యిలు, వంట చెరుకు పాటకు రూ.30 వేలు దరావత్తు, చిత్రపటాలు, దారాలు, జెండాలు, పండ్లు అమ్ముకొనే హక్కు, తలనీలాలు పోగు చేసుకొనేహక్కు, ప్రసాదాలు అమ్ముకొనే హక్కులకు రూ 20వేలు చెల్లించాలని తెలిపారు. ఈ బహిరంగ వేలం పాటలు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆమోదపు ఉత్తర్వులకు లోబడి అధికారుల సమక్షంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రేమికుల కథ విషాదాంతం..

- పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ముందుగా ప్రియుడు.. తర్వాత ప్రియురాలు మృతి

సత్తెనపల్లి రూరల్, జూలై 10 : తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోవడం లేదన్న కారణంతో ఆత్మహత్యకు ప్రయత్నించిన ప్రేమికుల కథ విషాదంగా ముగిసింది. ఈ సంఘటనకు సంబంధించి బుధవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేటకు చెందిన ఎం.అనూష(21) కుటుంబంలోని విభేదాల కారణంగా తల్లి వద్ద ఉంటుంది. ఈమె నరసరావుపేటలోని ఓ బ్యాంక్‌లో ఉద్యోగిగా పని చేస్తుంది. మండలంలోని ధూళిపాళ్ళకు చెందిన బండారు నవీన్ అదే బ్యాంక్‌లో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఐతే వివాహిత అయిన అనూషను నవీన్ పెళ్ళి చేసుకొనేందుకు నవీన్ తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో మనస్థాపానికి గురైన అనూష, నవీన్‌లు ఈనెల 3న భాగ్యనగర్‌కాలనీ సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు వీరిరువురిని గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఈనెల 5న నవీన్ (27) మృతి చెందగా మంగళవారం రాత్రి అనూషా మృతి చెందింది.

రాష్ట్ర సచివాలయం 1 బ్లాక్‌లోని సీఎంవో కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చిరుమామిళ్ల మధుబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ఘటనపై తమ మధ్య చర్చ సాగినట్లు మధుబాబు తెలిపారు. **- మాచర్లటౌన్**



దిక్సూచి
DIKSUCHI

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్



పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బైపీసీ స్ట్రీమ్

ఈ స్ట్రీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఎ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపీ, పులివెందుల) క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎన్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రామ్‌లు

పుణెలోని వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్(వీఎస్ఐ)-పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 24 సీట్లు ఉన్నాయి.
- ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సుకు బీఎస్సీ(జనరల్/అగ్రికల్చర్/ఫిషరీస్/నానోసైన్స్ అండ్ నానో టెక్నాలజీ)/బీఫార్మసీ/బీఈ/బీటెక్/బీఎస్సీ(బ్లెండెడ్)పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 30 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ నుంచి 30 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(వైన్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కెమిస్ట్రీ/అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/హార్టికల్చర్); పీజీడీఐఎఫ్ఏటీ/బీటెక్(కెమికల్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.

పీజీ డిప్లొమా

- **షుగర్ టెక్నాలజీ(ఎస్‌టీ):** ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ప్రవేశానికి బీఎస్సీ(సుగర్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్/ఎంపీసీ)/బీటెక్(కెమికల్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 50 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- **ఇండస్ట్రియల్ ఫర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ(ఐఎఫ్ఏటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 22 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ, వైన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆల్కహాల్ టెక్నాలజీ సబ్జెక్టులలో ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.



- **షుగర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ(ఎస్ఐటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఎలక్ట్రానిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులు; బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
- షుగర్ ఇంజనీరింగ్ డిప్లొమా(ఎస్ఈడీ): ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఇందులో ప్రవేశానికి బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్(ఎస్ఈసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. షుగర్‌మిల్లులో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. ఇందులో 15 సీట్లు ఉన్నాయి.
- **షుగర్ మాన్యుఫాక్చరింగ్ సర్టిఫికెట్(ఎస్ఎంసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీఎస్సీ(కెమిస్ట్రీ/సుగర్ టెక్నాలజీ)/డిప్లొమా(సుగర్ టెక్నాలజీ/సుగర్ మాన్యుఫాక్చర్/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి. ఇందులో 35 సీట్లు ఉన్నాయి.

సర్టిఫికెట్

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్(ఎస్‌బీసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు లేదా ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- **జ్యూస్ సూపర్విజన్ సర్టిఫికెట్(జేఎస్‌సీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **ఈటీపీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సర్టిఫికెట్(ఈటీపీఓఎం):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** ఎమ్మెస్సీ కోర్సులకు జూలై 23న; పీజీ డిప్లొమా(ఐఎఫ్ఏటీ)కి జూలై 24న
- **ఇంటర్వ్యూలు:** జూలై 23 - 25
- **వెబ్‌సైట్:** www.vsisugar.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jVHfrST లో చదవండి.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లోకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:అయనంక బోస్.

తిన్నడి విల్లు కథ



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద 'టీజర్' అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వివరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయారు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతూల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

● పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు ● నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.


- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది
విష్వక్ సేన్



'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంటక సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్‌'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.

ప్రేక్షకులను రప్పించడం ముఖ్యం



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు

తిరుమల (ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కే సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది" అని అన్నారు.

షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?



బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీ రంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mlTke5z లో చదవండి.

పల్నాడు వార్తలు

గ్రామాల్లో తాగునీటి పథకాలకు నేడు శంకుస్థాపన

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), జూలై 10: మండలంలోని కొప్పకొండ, యలమందల గ్రామాల్లో గురువారం జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పథకాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా యలమందల, కోటప్పకొండ గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శంకుస్థాపన చేయనున్నారు.

పాల ఉత్పత్తిదారుల అభివృద్ధే సంగం డెయిరీ లక్ష్యం

● డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు



ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేస్తున్న ఆంజనేయులు

చిట్టాపురం(ఈపూరు), జూలై 10: పాల ఉత్పత్తిదారుల అభివృద్ధే సంగం డెయిరీ లక్ష్యమని డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు అన్నారు. మండలంలోని చిట్టాపురం గ్రామంలోని పాలసేకరణ కేంద్రంలోని పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 103 మంది ఉత్పత్తిదారులకు రూ.6లక్షల 36వేల 815లు బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గేదెలకు ఉచిత బీమా, రాయితీపై గడ్డి విత్తనాలు, కృత్రిమ గర్భధారణం, ఉత్పత్తిదారునికి బీమా వంటి పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గేదెపాలకు రూ.100లకు 7.5శాతం, ఆవుపాలకు 3.0 బోనస్ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నర్సరావుపేట పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తేలప్రోలు వీరేంద్ర, పాలసేకరణ కేంద్రం అధ్యక్షుడు అడకా అంజయ్య, సెక్రటరీ కట్టా వేణుగోపాలరావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో బోనస్ పంపిణీ



బోనస్‌లు పంపిణీ చేస్తున్న మేనేజర్ వీరేంద్ర కుమార్

రొంపిచర్ల, జూలై 10 : సంగం డెయిరీలో పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు నరసరావుపేట పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ వీరేంద్రకుమార్ బుధవారం తెలిపారు. రొంపిచర్లలో గల దాసరిపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి బోనస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా 79 మంది పాల ఉత్పత్తిదారులకు ధరల వ్యత్యాసం కింద రూ. 2.67 లక్షలు, బోనస్ కింద రూ.3.42 లక్షలు పంపిణీ చేశారు. రూ. 100కి రూ.9.50 చొప్పున పంపిణీ చేశారు. అత్యధికంగా పాలు పోసిన గోపా కృష్ణకుమారి, నెల్లూరి అనసూర్య, పోపూరి స్వరాజ్యంలకు రూ.2వేలు, రూ.1700, రూ.1300 బహుమతి కింద అందజేశారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, అధ్యక్షుడు లక్ష్మీ నరసింహారావు, సెక్రటరీ రామారావు, టెస్టర్ కోటయ్య, సంఘసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు



కట్టుబడివారిపాలెంలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

కట్టుబడివారిపాలెం (నరసరావుపేట రూరల్), జూలై 10: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. నరసరావుపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూలును డీఈవో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని ప్రశ్నల ద్వారా అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన బోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం

చిలకలూరిపేట, జూలై 10: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులకు సాయిల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ, ఆత్మ వారి సంయుక్త ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. భూ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి మట్టి నమూనాలను పరిక్షించుకొని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మట్టి నమూనా సేకరణపై ప్రదర్శనను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సత్యగోపాల్, ఏడీఏ మస్తానమ్మ, సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏవో ఈ వరలక్ష్మి, ఆత్మ ఏవో రాజవంశీ, స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రీలత, శ్రీనివాసరావు, విద్యాలయం ప్రిన్సిపాల్ నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, జూలై 10: పట్టణంలోని ఎస్ఎస్సీ కాలనీ ఆవరణలోని గురుకుల పాఠశాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్యవివాహాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయవాది ఆరే సామ్రాజ్యం పాల్గొని విద్యార్థులకు బాల్యవివాహాల చట్టంపై వివరించారు. అదేవిధంగా విద్యార్థినులు ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

నూజెండ్ల, జూలై 10 : విద్యార్థులు అతిసార వ్యాధి(డయేరియా)పై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో టీ వీరభద్రాచారి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల పాఠశాలలో బుధవారం డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవి కుమార్, రిసోర్స్ పర్సన్ రమేష్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణమ్మ వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి చెన్నారావు, ఐటీసీ సెర్ఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్‌పర్సన్‌లు సుబ్బరామయ్య, పీ ప్రభాకర్, ఏఎన్ఎం నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

ఏడుకొండలు మృతికి ఎమ్మెల్యే సంతాపం

రొంపిచర్ల, జూలై 10: మండలంలోని పరగటిచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి ఏడుకొండలు ఈనెల 9వ తేదీన మృతి చెందాడు. కాగా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మట్టి ఖర్చుల కింద రూ.10వేలు ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు.

పేద మహిళకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆర్థిక సాయం

చిలకలూరిపేట, జూలై 10: పేదలకు ఇన్నర్ వీల్ క్లబ్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన మరియమ్మకు క్లబ్ తరపున గృహనిర్మాణం కోసం రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్లబ్ సీనియర్ సభ్యులు గోగినేని రత్నకుమారి అందించిన విరాళంతో ఈ ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ

వినుకొండ. జూలై 10: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ, యువకులకు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణా తరగతులు, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ కెశ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

16 నుంచి నవతరం పార్టీ ఆధ్వర్యంలో ప్రజావారధి

చిలకలూరిపేట, జూలై 10: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవటం కోసం ప్రజావారధి అనే కార్యక్రమాన్ని ఈనెల 16 నుంచి ప్రారంభిస్తున్నట్టు నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు.

తాగునీరు, పారిశుధ్యం, పౌరసేవల్లో మాట రానివ్వొద్దు

● మున్సిపల్ అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 10 : ప్రజలకు ముఖ్యమైన అవసరాలైన తాగునీరు, పారిశుధ్యంతో సహా ఏ పౌరసేవల్లో లోటు రాకుండా చూసుకోవాలని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధికారులతో స్పష్టం చేశారు. బుధవారం చిలకలూరిపేటలోని తన నివాసంలో మున్సిపల్ అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల విషయం ప్రభుత్వం చూసుకుంటుందని, సేవల విషయంలో క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థంగా పని చేయాలని, డయేరియా వంటి నీటి ఆధారిత అనారోగ్యాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో తాగు నీటి సమస్య, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య నిర్వాహణ పనులతో పాటు డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు తదితర అంశాలపై చర్చించి దిశ నిర్దేశం చేశారు. తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. పట్టణంలో పని చేయని వీధి దీపాలను గుర్తించి మరమ్మతులు, అవసరమైన చోట పట్టణ శివారు ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ వ్యాప్తంగా పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. రహదారుల వెంట పెద్ద మొత్తంలో వ్యర్థాలు వేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం కొత్త నీరు వచ్చే సమయం కావటంతో పరిసరాలు శుభ్రంగా లేక పోతే రకరకాల వ్యాధులు ప్రబలుతాయని, దోమల నియంత్రణ లేకుంటే డెంగీ వంటి విష జ్వరాలు వెంటాడతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

ఉచిత ఇసుక విధానం గొప్ప నిర్ణయం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 10 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానం ప్రవేశ పెట్టడం గొప్ప నిర్ణయం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఉచిత ఇసుక పాలసీతో సామాన్యులకు భారీ ఊరట లభించిందని, పేదల సొంతింటి కల తీరనుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి నెల రోజుల్లో అమల్లోకి తెచ్చారన్నారు. ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తూ జీవో 43 విడుదల చేయడం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటు లో ఉంచాలన్నదే తెలుగుదేశం విధానం అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను పెంచి పోషించిందని, ఇసుక ద్వారానే రూ.50వేల కోట్లు కొల్లగొట్టిందన్నారు. గతంలో గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో రూ.800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని దారాదత్తం చేశారని చెప్పారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షలకు పైగా ఇల్లు కట్టొచ్చు అంటే వారి అవినీతి ఏ స్థాయిలో చేశారో అర్థం చేసుకోవచ్చునన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధిస్తూ రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా ఉచిత ఇసుకపాలసీ రూపొందించామన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకనుగుణంగా ప్రలందరికీ ఉచిత ఇసుక అందిస్తామని అన్నారు.

నియోజవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సహకరించాలి

అభివృద్ధిలో నియోజవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం తరపున తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. బుధవారం సచివాలయం ఒకటో బ్లాక్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చదలవాడ మాట్లాడుతూ అభివృద్ధికి మీరు రోల్‌మోడల్, అదే స్ఫూర్తితో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నో వనరులున్న నరసరావుపేట గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబాటుకు గురైందన్నారు. మీ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి నమూనాగా మార్చాలని బావిస్తున్నట్లు వివరించారు. అనంతరం మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడిని కలిశారు. నియోజకవర్గంలో సాగునీటి కాల్వల్లో సిల్టు పేరుకోపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందుల్ని తెలియజేశారు. తక్షణమే సాగునీటి కాల్వల్లో పూడిక తొలగించే పనులు చేపట్టాలని, అందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని మంత్రిని కోరారు. వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలంటే ముందు సాగునీటి రంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మున్సిపల్ అక్రమ పైపులైన్ తొలగించాలి

నరసరావుపేట టౌన్, జూలై 10: అక్రమంగా ఆనంద నిలయం వెంచర్ నిర్వాహకులు బీసీ కాలనీ వద్ద బైపాస్ రోడ్డు తవ్వి నిర్మించిన మున్సిపల్ పైపులైన్‌ను తొలగించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆనంద నిలయం వెంచర్ అక్రమంగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటి పైపులైన్ స్థలాన్ని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్రహాంలింకన్ సందర్శించారు. అర్ధరాత్రి హడావిడిగా ఆర్అండ్‌బీ బైపాస్ రోడ్డు తవ్వి వేసినట్లు మీడియా కథనాలు వచ్చినా మున్సిపాలిటీ వాళ్లలో కదలిక లేదన్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డంపింగ్ యార్డుని తొలగించాలి

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

నరసరావుపేట టౌన్, జూలై 10: ఎస్ఆర్‌కేటీ వద్ద డంపు యార్డుని వెంటనే తొలగించాలని, దుర్వాసనని అరికట్టి ప్రజలను డెంగీ, మలేరియా జ్వరాల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. బుధవారం ఎస్ఆర్‌కేటీ డంపింగ్ యార్డును సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని డంపింగ్ యార్డును అక్కడ నుంచి తొలగించాలన్నారు. చెత్త చెదరాన్ని తగల బెట్టడంతో వచ్చే పొగవల్ల కర్నూలు-గుంటూరు హైవేలో జరిగే ప్రమాదాలను నివారించాలన్నారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

శోభాయమానంగా జగన్నాథ రథయాత్ర



సాతులూరులో రథం లాగుతున్న మహిళలు

నాదెండ్ల, జూలై 10 : మండలంలోని సాతులూరు గ్రామంలో జగన్నాద స్వామి రథ యాత్ర శోభాయమానంగా జరిగింది. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థాన కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన రథయాత్రలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కోలాటంతో కీర్తనలు, భజనల మధ్య ప్రధాన వీధుల్లో రథాన్ని ఊరేగించారు. వేణుగోపాల స్వామి దేవాలయ కమిటీ, గ్రామస్థులు తయారు చేయించిన 108 రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు ఐనవోలు శివనాగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి, పూర్ణ చంద్రరావు, పసుమర్తి శివనాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

పట్టణంలో విద్యుత్ శాఖ అధికారుల దాడులు

● 82 మందికి రూ.3.75 లక్షల అపరాధ రుసుం

చిలకలూరిపేట, జూలై 10: చిలకలూరిపేట మండలం, పట్టణ పరిధిలో విద్యుత్‌శాఖ ఎస్ఈ పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు జరిపారు. సిబ్బంది 31 బృందాలుగా దాడులు జరిపి అధికారికంగా అధికలోడు వాడుతున్న 82 సర్వీసులను గుర్తించారు. వారికి రూ.3.75 లక్షల అపరాధ రుసుం విధించారు. ఇటువంటి దాడులు తరచూ నిర్వహిస్తామని, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడులకు ముందు ఎస్ఐ విజయ్ కుమార్, ఈఈలు సీహెచ్ రమేష్, కేవీఎల్ఎన్ మూర్తి సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈఈలు, ఈఈలు గురునాథరావు, మలికార్జునరావు, 11 మంది ఏఏలు పాల్గొన్నారు.

రైస్, దాల్ మిల్లర్లతో తహసీల్దార్ సమావేశం

చిలకలూరిపేట, జూలై 10 : రైతు బజారులో గురువారం నుంచి తక్కువ ధరలకే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం తరపున ప్రారంభిస్తున్నట్టు చిలకలూరిపేట తహసీల్దార్ జ్వాలా నరసింహం బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన కౌంటర్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. వారి సహకారాన్ని ఆయన కోరారు. రైతు బజారు, పెద్ద దుకాణాల వద్ద ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్లలో కిలోకు కంది పప్పు రూ.160, స్టీమ్డ్ బియ్యం 49, పచ్చి బియ్యం 48 చొప్పున అమ్మకం చేస్తారని ఆయన తెలిపారు.

206 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు

కారుమంచి(శావల్యాపురం), జూలై 10: నర్సరావుపేటలోని డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శావల్యాపురం మండలం కారుమంచిలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 206మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకొన్నారు. వారిలో 58మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. మిగిలినవారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం నిర్వహణకు టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, డీసీసీ మాజీ డైరెక్టర్ గోపాళం శివప్రసాద్, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు, గ్రామపెద్దలు సహకారం అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియన్ టూ ట్రాన్స్‌ఫార్మ్ ఇండియా

నరసరావుపేట టౌన్, జూలై 10: ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో బుధవారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియన్ టూ ట్రాన్స్‌ఫార్మ్ ఇండియా అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తురియానంద సరస్వతి మాట్లాడుతూ మానవ వనరులకు ప్రపంచానికే భారతదేశం కేంద్ర బిందువు అన్నారు. కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చు అన్నారు.

పశు సంవర్ధకశాఖలో డ్రైవర్ పోస్టులకు ప్రకటన

నరసరావుపేట లీగల్, జూన్ 10: పల్నాడు జిల్లా నరసరావుపేటలో 1962 పశు సంచార అంబులెన్స్ వాహనాల్లో ఖాళీగా ఉన్న నాలుగు డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు జిల్లా మేనేజర్ ఎం రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై అవ్వాలని, హెవీ లైసెన్స్, బ్యాడ్జి లైసెన్స్ కలిగి ఉండి రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. 35 సంవత్సరాలకు మించకూడదన్నారు. ఈ అర్హత కలిగిన వారు ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు పట్టణంలోని పశుసంవర్ధక శాఖ జేడీ ఆఫీసులో హాజరు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9542571285ను సంప్రదించాలని కోరారు.

పట్టాలు ఇప్పిస్తామని మోసం చేసిన జగన్

● న్యాయం చేయాలని లోకేశ్‌కు యడవల్లి రైతుల విజ్ఞప్తి



లోకేశ్‌ను కలసిన యడవల్లి రైతులు

చిలకలూరిపేట, జూలై 10: జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇక్కడకు వచ్చినప్పుడు యడవల్లి దళిత, గిరిజన రైతులకు పట్టాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారని బుధవారం చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామానికి చెందిన రైతులు మంత్రి నారా లోకేశ్‌ను ప్రజాదర్బార్‌లో కలసి విన్నవించారు. మాజీ మంత్రి విడదల రజిని సారథ్యంలో కోట్ల రూపాయల విలువ చేసే తమ మైనింగ్ భూములను కాజేశారని వారు ఆరోపించారు. జగన్ కుటుంబసభ్యులు ఇందులో పాత్రదారులుగా ఉన్నారని తెలిపారు. తమ భూములకు సంబందించిన పట్టాలను తమకు తిరిగి ఇచ్చి స్వాధీనం చేయాలని, ఎత్తి పోతల పథకం ద్వారా సాగు నీటి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ అక్కడ మైనింగ్ పనులను కొనసాగి స్తున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాకాణి రోశయ్య, తాళ్నూరి వెంకటరావు, వేల్పుల శామ్యూలు, మల్లవరపు మరియబాబు, కొమ్మాలపాటి శివ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూలై 10 : పట్టణంలోని టౌన్ - 1 సెక్షన్‌లో గురువారం విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్, ఫైర్‌స్టేషన్, పోలీసుస్టేషన్, చౌత్రసెంటర్, గీతా మందిరం, వాస వీనగర్, వినాయకుడి గుడి, ఆర్యవైశ్య కళ్యాణ మండపం, మద్ది మల్లయ్య వీధి, కృష్ణమహల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

నేడు ఆలయ భూములు వేలం

ఈపూరు, జూలై 10: ఈపూరులోని విశ్వేశ్వరాలయం భూములకు గురువారం కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి తెలిపారు. 2024-25 నుంచి 2027 సంవత్సరానికి అంటే మూడు సంవత్సరాలకు కౌలు వేలం నిర్వహిస్తున్నటు తెలిపారు. సర్వే నంబరు 81లోని 4.14 ఎకరాలకు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

ఏఎంజీలో రేపు జాబ్ మేళా

చిలకలూరిపేట, జూలై 10: పట్టణంలోని స్వచ్ఛంద సేవాసంస్థ ఏఎంజీ ప్రాంగణంలో గల ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాలో వరుణ్ మోటార్స్, ఎన్‌ఫీల్డ్, అశోక్ లేల్యాండ్‌లు, జోసిల్, పెప్సీ, అమర రాజ, క్యాప్ స్టోన్ కన్సల్టెన్సీ, నెల్లూరు శ్రీసిటీలోని పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని ప్రిన్సిపాల్ వీ మణిదీపక్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఐటీఐ, ఎలక్ట్రికల్, ఫిట్టర్, డిజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, ఆర్ అండ్ ఏసీ, సివిల్‌తో పాటు తదితర ట్రేడ్‌లు పూర్తి చేసిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చని వివరించారు. వివరాలకు 9966652250, 6300834023లను సంప్రదించాలని ఆయన కోరారు.